సాక్షి నిజామాబాద్

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025

న్యూస్‌రీల్‌

నేడు జిల్లాకు పీసీసీ చీఫ్‌ మహేశ్‌ గౌడ్‌ రాక



నిజామాబాద్‌ సిటీ: పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌ కుమార్‌గౌడ్‌ శనివారం జిల్లాకు రానున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా నగరంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కేంద్రంలోని దుబ్బలో సార్వజనిక్‌ గణేశ్‌ మండలి వినాయకుడికి మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం వినాయక నిమజ్జన శోభాయాత్రను ప్రారంభిస్తారని నగర కాంగ్రెస్‌ అధ్యక్షుడు, నుడా చైర్మన్‌ కేశ వేణు తెలిపారు.

నేడు వైన్స్‌ షాపులు బంద్‌

ఖలీల్‌వాడి: వినాయక నిమజ్జనం సందర్భంగా శనివారం నిజామాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలోని వైన్స్‌షాపులు, కల్లు దుకాణాలు, బార్లు బంద్‌ చేస్తున్నట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు దుకాణాలను మూసి ఉంచాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లింబాద్రి నర్సింహస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



మోర్తాడ్‌: భీమ్‌గల్‌ మండలంలోని లింబాద్రి గుట్ట శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆలయాన్ని శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌ రావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు నంబి పార్థసారథి, వాసు పంతులు వారికి ఘన స్వాగతం పలికారు. సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలను నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను ప్రవీణ్‌రావుకు, ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై సుభాష్‌ బందోబస్తును నిర్వహించారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్‌

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని మామిడిపల్లిలో ఇటీవల జరిగిన వృద్ధుడి హత్యకేసులో ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్‌ శుక్రవారం తెలిపారు. కామారెడ్డికి చెందిన అంగర లక్ష్మి, భర్త వేణుకుమార్‌తో కలిసి మామిడిపల్లిలో నివాసం ఉంటున్నారు. కాగా మోర్తాడ్‌ మండలం సుంకెట్‌ గ్రామానికి చెందిన పోతు నరేందర్‌ (65) మామిడిపల్లిలోని వీరి నివాసానికి తరచూ వస్తుండేవాడు. గత నెల 20న నరేందర్‌ వారి ఇంటికి వెళ్లగా, లక్ష్మి, ఆమె భర్త వేణుకుమార్‌, అల్లుడు రాజశేఖర్‌, కొడుకు నవీన్‌, కుమార్తె నవ్య కలిసి హత్యచేశారు. నరేందర్‌పై ఉన్న బంగారు గొలుసు, రెండు ఉంగరాలను కాజేశారు. మృతదేహాన్ని గోనెసంచిలో కుక్కి ఎవరికి అనుమానం రాకుండా మామిడిపల్లి వద్ద నిజాంసాగర్‌ కెనాల్‌లో వదిలేశారు. మోర్తాడ్‌లో మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులకు నిందితులైన లక్ష్మి, అల్లుడు రాజశేఖర్‌, కుమారుడు నవీన్‌ పట్టుబడ్డారు. కాగా, వేణుకుమార్‌, నవ్య పరారీలో ఉన్నారని, గాలింపు చేపట్టామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సర్వం సిద్ధం..

నేడు వినాయక నిమజ్జనం

- నగరంలో శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి
- 8 ఫీట్ల విగ్రహాలు బాసరకు..
- 8 ఫీట్ల కంటే ఎత్తు ఉన్న విగ్రహాలు ఉమ్మెడ గోదావరికి
- 1300 మంది పోలీసులతో బందోబస్తు



బాసర, ఉమ్మెడ గోదావరికి వెళ్లే రూట్‌ మ్యాప్‌



నగరంలో శోభాయాత్ర నిర్వహించే రూట్‌ ఇదే..

ఖలీల్‌వాడి/నిజామాబాద్‌ రూరల్‌ : లంబోదరుడి నిమజ్జనానికి జిల్లా వ్యాప్తంగా సర్వం సిద్ధమైంది. విశేష పూజలందుకున్న వినాయకుడు శనివారం గంగమ్మ ఒడికి చేరనున్నాడు. నిజామాబాద్‌ నగరంలో సార్వజనిక్‌ గణేశ్‌ మండలి ఆధ్వర్యంలో శోభాయాత్ర వైభవంగా నిర్వహించనున్నారు. 11 జతల ఎడ్లతో రథం కదులుతుంది. దుబ్బా నుంచి ప్రారంభమయ్యే వినాయక శోభాయాత్ర శివాజీచౌక్‌, గాంధీచౌక్‌, నెహ్రూపార్క్‌, గాజుల్‌పేట్‌, పెద్దబజార్‌, గోల్‌హన్మాన్‌, పులాంగ్‌ మీదుగా వినాయక్‌నగర్‌లోని వినాయకుల బావి వద్దకు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. రోడ్ల మరమ్మతులు, విద్యుత్‌ వైర్లు విగ్రహాలకు తగలకుండా సరిచేశారు.

పటిష్ట బందోబస్తు

వినాయక నిమజ్జనం సందర్భంగా కమిషనరేట్‌ పరిధిలోని ఆయా పోలీస్‌ స్టేషన్ల సిబ్బందితోపాటు ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, హోంగార్డులు సుమారు 1300 మంది బందోబస్తులో పాల్గొననున్నారు. శోభాయాత్రలో ట్రాఫిక్‌ నియంత్రణకు ఎక్సైజ్‌, ఫారెస్ట్‌ సిబ్బందితోపాటు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు సేవలందించనున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్‌ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించనున్నారు. గణేశ్‌ నిమజ్జనం సందర్భంగా బాసర, ఉమ్మెడ బ్రిడ్జి ప్రాంతాలను శుక్రవారం రాత్రి సీపీ సాయిచైతన్య పరిశీలించారు.



ఉమ్మెడ బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య



నగరంలో సిద్ధమైన వినాయకుల బావి

ట్రాఫిక్‌ డైవర్షన్‌

వినాయక నిమజ్జనం రోజు నిజామాబాద్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులను డైవర్షన్‌ చేస్తున్నట్లు ట్రాఫిక్‌ ఏసీపీ మస్తాన్‌ ఆలీ తెలిపారు. బోధన్‌ నుంచి వచ్చే బస్సులు అర్సపల్లి రైల్వేగేట్‌ నుంచి, కలెక్టర్‌ ఆఫీస్‌, కంఠేశ్వర్‌ బైపాస్‌, రైల్వే అండర్‌ పాస్‌, ఎన్టీఆర్‌ చౌరస్తా, రైల్వే స్టేషన్‌ మీదుగా బస్టాండ్‌ వైపు వెళతాయి. బాన్సువాడ, డిచ్‌పల్లి నుంచి వచ్చే బస్సులు ప్రస్తుత రూట్‌లోనే నడువనున్నాయి. లారీలు, భారీ వాహనాలు బైపాస్‌ నుంచి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

భారీ విగ్రహాల రూట్లు ..

నగరం నుంచి భారీ విగ్రహాల నిమజ్జనం కోసం బాసర వద్ద, ఉమ్మెడలోని గోదావరి వద్ద ఏర్పాట్లు చేశారు. ఉమ్మెడలో ఆరు క్రేన్లు, బాసరలో నాలుగు క్రేన్ల ద్వారా వినాయక విగ్రహాల నిమజ్జనం చేయనున్నారు. కాగా, 8 ఫీట్ల లోపు గణపతి విగ్రహాలను నగరంలోని నెహ్రూపార్క్‌, అర్సపల్లి, జాన్కంపేట్‌, నవీపేట మీదుగా బాసరకు తరలించాలి. అనంతరం ఖాళీ వాహనాలు బాసర, ధర్మాబాద్‌, కందకుర్తి, సాటాపూర్‌, రెంజల్‌, నవీపేట మీదుగా రావాల్సి ఉంటుంది.

- ఎనిమిది ఫీట్ల కంటే ఎత్తుగా ఉన్న విగ్రహాలను నగరం నుంచి నందిపేట మండలం ఉమ్మెడకు తీసుకెళ్లాలి. పూలాంగ్‌, ఎన్టీఆర్‌ చౌరస్తా, రైల్వే స్టేషన్‌, బస్‌స్టేషన్‌, రైల్వే ఓవర్‌ బ్రిడ్జి, శివాజీ చౌక్‌, దుబ్బా, జీజీ కాలేజీ చౌరస్తా, బైపాస్‌ రోడ్డు, డీఎస్‌ చౌరస్తా, ముబారక్‌నగర్‌, మాణిక్‌బండార్‌, దాస్‌నగర్‌, మాక్లూర్‌, మాదాపూర్‌, నందిపేట్‌ మీదుగా ఉమ్మెడ సరిహద్దులోని గోదావరి బ్రిడ్జి వద్దకు వెళ్లాలి. ఇదే రూట్‌లో నందిపేట, నవీపేట్‌ మీదుగా బాసర గోదావరి బ్రిడ్జికి వెళ్లొచ్చు.

బీజేపీలో టిక్కెట్ల పంచాయితీ

- స్థానిక సంస్థల్లో కమలం తరఫున పోటీ చేసేందుకు ఆశావహుల పాట్లు
- హామీ వచ్చిందంటూ చెప్పుకుంటున్న పలువురు నాయకులు
- కోర్‌ కమిటీ ఆమోదిస్తేనే టిక్కెట్లని తేల్చి చెప్పిన రాష్ట్ర నాయకత్వం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీజేపీలో టిక్కెట్ల పంచాయితీ నెలకొంది. తమకు టిక్కెట్టు వస్తుందంటే.. తమకు హామీ దక్కిందంటూ పలువురు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు చెప్పుకుంటున్నారు. ఆయా నియోజకవర్గాల ముఖ్య నాయకుల నుంచి తమకు ఇప్పటికే హామీ లభించిందంటూ ప్రచారం చేసుకుంటుండడంతో పలువురు నాయకుల మధ్య కోల్డ్‌వార్‌ మాదిరి పంచాయితీ నెలకొంది. దీంతో ఈ విషయం రాష్ట్ర పార్టీ వరకు చేరింది. కీలకమైన నిజామాబాద్‌ జిల్లాలో స్థానిక టిక్కెట్ల కేటాయింపు విషయమై రాష్ట్ర అధ్యక్షుడు ప్రత్యేకంగా దృష్టి సారించడం గమనార్హం.

గెలుస్తామనే ఆశతో...

గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి బీజేపీలో స్థానిక సంస్థల టిక్కెట్ల కోసం పోటాపోటీ నెలకొంది. వరుసగా రెండుసార్లు లోక్‌సభ సీటు గెలవడం, ఉమ్మడి జిల్లాలో మూడు ఎమ్మెల్యే సీట్లు గెలవడంతోపాటు గ్రామాల్లో పార్టీ మరింత బలోపేతం కావడంతో టిక్కెట్లకు డిమాండ్‌ పెరిగింది. పైగా గ్రామాల్లో యువత పార్టీకి దన్నుగా నిలబడుతుండడంతో గెలుస్తామనే ఆశతో పలువురు పోటీకి ఆసక్తి చూపుతున్నారు. ఎవరికి వారే ఆయా నియోజకవర్గాల్లో టిక్కెట్ల కోసం పట్టుపడుతున్నారు. అయితే సదరు నియోజకవర్గాల నాయకులు తమ అనుచరులకు టిక్కెట్లు ఇస్తామని హామీలు ఇస్తున్నట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ నడుస్తోంది. ఈ వ్యవహారాలన్నీ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి చేరడంతో టిక్కెట్ల కేటాయింపు అనేది ఏ ఒక్క నాయకుడి చేతిలో ఉండదని, కోర్‌ కమిటీ ఎంపికలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఆమోదం తప్పనిసరి అని స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో టిక్కెట్టు హామీ వచ్చిందంటూ సంతోషపడితే కుదరదని కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన కీలక నేత మనసులో ఏముందో అనే అంతర్గత చర్చ పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది. స్థానిక ఎన్నికల నిర్వహణ విషయమై నోటిఫికేషన్‌ జారీ చేసే విషయంలో ఇప్పటికీ స్పష్టత రాలేదు. అయినప్పటికీ ముందే కమలం పార్టీలో టిక్కెట్ల కుస్తీ నడుస్తుండడంతో వ్యవహారం రసకందాయంగా మారింది.

ఆశావహుల్లో టెన్షన్‌..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసేందుకు జిల్లాలో పలువురు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కౌన్సిలర్‌, కార్పొరేటర్‌ టిక్కెట్లు ఆశిస్తున్న ఆశావహులు మాత్రం, తమకు టిక్కెట్టు విషయమై హామీ వచ్చిందంటూ పలుచోట్ల చెప్పుకుంటున్నారు. అయితే ఇలా చెప్పుకుంటున్న నాయకులకు మాత్రం కీలక నాయకత్వం నుంచి ఝలక్‌ వచ్చింది. క్రమశిక్షణ కలిగిన బీజేపీలో టిక్కెట్ల కేటాయింపు కోర్‌ కమిటీ చేతిలో ఉంటుందని, కోర్‌ కమిటీ తయారు చేసిన ఆశావహుల జాబితా మేరకు అన్ని కోణాల్లో పరిశీలించి రాష్ట్ర అధ్యక్షుడు ఫైనల్‌ చేశాకే టిక్కెట్టు దక్కుతుందని పార్టీ శ్రేణులకు మెసేజ్‌ పాస్‌ అయింది. దీంతో తమకే టిక్కెట్టు అని చెప్పుకుంటున్న ఆశావహుల్లో టెన్షన్‌ నెలకొంది.

తులం బంగారం @రూ.లక్షా10 వేలు

- రికార్డు స్థాయికి చేరిన ధరలు
- శుభకార్యాలు దగ్గర పడుతుండడంతో తలలు పట్టుకుంటున్న సామాన్యులు



నిజామాబాద్‌ రూరల్‌: బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పట్లో ఆగేటట్లు కనిపించడం లేదు. తాజాగా మార్కెట్లో బంగారం తులం ధర రూ.లక్షా10 వేలకు చేరుకుంది. వారం రోజుల క్రితం బంగారం తులం రూ.లక్షా 5 వేలు పలికింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో పసిడి ధరలు పైపైకి దూసుకెళ్తున్నాయి. పెళ్లిళ్లు, దసరా, దీపావళి పండుగల సీజన్‌ వేళ బంగారం కొనుగోలు చేసే వాళ్లను ప్రస్తుత ధరలు బెంబేలెత్తిస్తున్నాయి.

వారం రోజుల బంగారం ధరలు

తేదీ	ధర(తులం)
30.08.2025	1,05,900,
01.09.2025	1,07,200
02.09.2025	1,07,300
03.09.2025	1,08,400
04.09.2025	1,09,400
05.09.2025	1,10,000

కాంగ్రెస్‌ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్‌ నాయకులు

బాన్సువాడ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బాన్సువాడలో గులాబీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ సూచించారు. సిద్దిపేట జిల్లాలోని కేసీఆర్‌ ఫాంహౌస్‌లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి ఆధ్వర్యంలో బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్‌ నాయకులు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బాన్సువాడకు చెందిన మాజీ జెడ్పీటీసీ, మాజీ సర్పంచ్‌ నార్ల రత్నకుమార్‌తోపాటు ఇషాక్‌, గులెపల్లి మొగులయ్య, మల్లిబాబుతో పాటు కోటగిరి, వర్ని మండలాలకు చెందిన కాంగ్రెస్‌ నాయకులకు కేటీఆర్‌ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌ నాయకులు జుబేర్‌, అంజిరెడ్డి, యలమంచలి శ్రీనివాస్‌రావు, కోటగిరి శ్రీనివాస్‌రావు, కిషన్‌, ఎర్రవాటి సాయిబాబా, మోచీ గణేష్‌, గాండ్ల కృష్ణ, బోడ చందర్‌, ఉమామహేష్‌, రమేష్‌యాదవ్‌, శివసూరి తదితరులున్నారు.

అవార్డులందుకున్న ఉత్తమ ‘గురువులు’



రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ యోగితారాణా చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ప్రొఫెసర్‌ రాంబాబు, సీహెచ్‌ శంకర్‌, గోపాలకృష్ణ

తెయూ(డిచ్‌పల్లి)/ నిజామాబాద్‌ రూరల్‌: అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక, ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ప్రొఫెసర్‌ గోపిశెట్టి రాంబాబు, సీహెచ్‌ శంకర్‌, రాఘవపురం గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమంలో వారు విద్యాశాఖ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ యోగితా రాణా, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. అధికారులు అవార్డుతోపాటు శాలువా, మెమోంటో, పూలమాలతో ఘనంగా సత్కరించి ప్రోత్సాహకంగా నగదు పారితోషికాన్ని అందజేశారు. అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ విద్యాశాఖ ఉత్తమమైన ఫలితాలు సాధించేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. అవార్డులు అందుకున్న ప్రొఫెసర్‌ రాంబాబుకు తెలంగాణ వర్సిటీలోని వివిధ విభాగాల హెచ్‌వోడీలు, డైరెక్టర్లు, వర్సిటీ టీచర్స్‌ అసిసోయేషన్‌ ప్రతినిధులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. సీహెచ్‌ శంకర్‌, ఆర్‌ గోపాలకృష్ణలను ఉపాధ్యాయ సంఘాల బాధ్యులతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రయాణం.. ప్రాణ సంకటం



బతుకుదెరువు కోసం ప్రమాదం అంచున ప్రయాణం చేస్తున్నారీ కూలీలు. ట్రాలీ ఆటో ముందు భాగం, టాప్‌పై, వెనుక భాగంలోని రాడ్లపై నిలబడి ప్రమాదకరంగా వెళ్తున్నారు. బ్యాండ్‌ కొట్టేవారు ట్రాలీ ఆటోలో గుంపులుగా వెళుతున్న ఈ దృశ్యం ఇందల్వాయి వద్ద జాతీయ రహదారిపై కనిపించింది.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌

ఎస్సారెస్పీ వరద గేట్ల మూసివేత



- ఇన్‌ఫ్లో తగ్గుముఖం
- గోదావరిలోకి నీటి విడుదల నిలిపివేత

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో శ్రీరాంసాగర్‌ జలాశయం వరద గేట్ల ద్వారా నీటి విడుదలను అధికారులు శుక్రవారం నిలిపివేశారు. ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 50 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 355 టీఎంసీల నీరు వచ్చింది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 4500, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 3500, మిషన్‌ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 666 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా 1090.10(77.23 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

దిగువకు 240 టీఎంసీలు

గత నెలలో ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు రావడంతో ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను ప్రారంభించారు. మధ్యలో రెండ్రోజులు మాత్రమే నిలిపివేశారు. తరువాత మళ్లీ వరద పోటెత్తడంతో గత నెల 27 నుంచి ఈనెల 4 వరకు నిరంతరం నీటి విడుదల చేపట్టారు. గరిష్టంగా 5.75 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రాజెక్ట్‌ నుంచి 240 టీఎంసీల నీటిని గోదావరిలోకి వదిలారు.

10 రోజుల్లో 180 టీఎంసీలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: శ్రీరాంసాగర్‌ జలాశయం నుంచి గత 10 రోజుల్లో 180 టీఎంసీల నీటిని గోదావరి దిగువకు వదిలారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చింది. దీంతో అధికారులు 39 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. కాగా, గత జూన్‌ 1 నుంచి ఇప్పటి వరకు జలాశయంలోకి ఎగువ నుంచి 355 టీఎంసీల నీరు వచ్చింది. 282 టీఎంసీల నీటిని వివిధ రూపాల్లో బయటకు పంపారు. ఇందులో 240 టీఎంసీలు గోదావరిలోకి వదిలారు. మరో 42 టీఎంసీలను మిషన్‌ భగీరథ, ఇందిరమ్మ వరద కాలువ, కాకతీయ కాలువ ద్వారా వదిలారు.

గ్యాస్‌ ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు

 భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, గ్యాస్‌ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్‌ డిపో–1కు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం సికింద్రాబాద్‌ నుంచి నిజామాబాద్‌ వైపు వస్తోంది. జంగంపల్లి గ్రామశివారులోని జాతీయ రహదారిపై బస్సు ముందున్న గ్యాస్‌ ట్యాంకర్‌ను వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, రోడ్డు అవతలి వైపునకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సు ముందర భాగం, ప్రవేశ ద్వారం తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో ప్రయాణికులు అత్యవసర ద్వారం గుండా బయటకు వచ్చారు. ఈ ప్రమాదంలో గ్యాస్‌ ట్యాంకర్‌ నుంచి గ్యాస్‌ లీకేజీ కాకపోవడంతోపాటు పేలకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఒకవేళ ట్యాంకర్‌ పేలి ఉంటే భారీ ప్రమాదం జరిగేదని పలువురు పేర్కొన్నారు.



బస్సులోని అత్యవసర ద్వారం నుంచి కిందకు దిగుతున్న ప్రయాణికులు



గ్యాస్‌ ట్యాంకర్‌



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందుభాగం

ప్రజా సంక్షేమమే ధ్యేయం

పెర్కిట్‌: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ మార గంగారెడ్డి అన్నారు. అంకాపూర్‌లోని రాజారాంనగర్‌ కాలనీలో నూతనంగా మంజూరైన చౌక ధరల దుకాణాన్ని మార గంగారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిరుపేదలకు ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్‌ మార చంద్రమోహన్‌, ఏఎంసీ డైరెక్టర్‌ అమృత్‌ రావు, వీడీసీ అధ్యక్షుడు కుంట గంగారెడ్డి, ఎంసీ గంగారెడ్డి, మురళీ, గోపాల్‌, సృజన్‌, శృంగారం నర్సయ్య, కిషన్‌, భూమేశ్‌ పాల్గొన్నారు.

